ప్రజాశక్తి
శనివారం 20 మే 2023
5
పార్వతీపురం మన్యం



పిటిజిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఎపి గిరిజన గురుకుల బాలికల (పిటిజి) పాఠశాలలో మూడో తరగతి, 4 నుంచి 9వ తరగతిలో మిగులు సీట్లు ప్రవేశాలకు అర్హులైన గిరిజన విద్యార్థినిల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.కమల కుమారి తెలిపారు. మూడో తరగతిలో గిరిజన విద్యార్థినులకు, అలాగే నాలుగు నుంచి తొమ్మిదవ తరగతుల్లో గదబ, సవర విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. మూడో తరగతిలో 80 సీట్లు, నాలుగో తరగతిలో 3, ఏడో తరగతిలో రెండు సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో గత ఏడాది రెండవ తరగతి చదివి ఉండాలని, తల్లిదండ్రుల వార్షికోత్సవం సంవత్సరానికి లక్ష రూపాయల్లోపు ఉండాలని అన్నారు. కావున అర్హత గల గిరిజన, గిరిజనేతర విద్యార్థులు జూన్ 5 లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు భద్రగిరిలో గల పిటిజి గురుకుల బాలికల పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.



సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

బలమైన ఉద్యమాలు నిర్మించి

సుందరయ్య వారసత్వాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పాలకవర్గాల విధానాల వల్ల అనునిత్యం నష్టపోతున్న వర్గాలను కలుపుకొని బలమైన ఉద్యమాలను నిర్మించడం ద్వారా సుందరయ్య ఆశయాలను కొనసాగించాలని సిపిఎం కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా సిపిఎం మండలకార్యదర్శి బంటు దాసు ఆధ్వర్యంలో బంటువానివలసలో నిర్వహించిన వర్ధంతి సభలో వేణు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన దేశ కమ్యూనిస్టు ఉద్యమ ప్రసిద్ధ నేతల్లో పుచ్చలపల్లి సుందరయ్య ఒకరిని కొనియాడారు. ఆయన రూపొందించిన మార్క్సిస్టు దృక్పథం, విప్లవాత్మక పార్టీ నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిదని అన్నారు. ఆయన స్ఫూర్తితో పార్టీ కేడర్ పెంపొందించడం, తీర్చిదిద్దడం వంటి వాటిని చేసుకుంటూ ఆయన వేసిన బాటలో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు, హమాలీలు, సిపిఎం కార్యకర్తలు సానుభూతిపరులు పాల్గొన్నారు.

కురుపాం : సుందరయ్య వర్ధంతి స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం సిపిఎం ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వర్ధంతి సభ జరిగింది. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సుందరయ్య సుందరయ్య స్ఫూర్తితో పెద్దఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పి.తిరుపతిరావు, రామారావు, యుటిఎఫ్ మండల కార్యదర్శి టి. శ్రీరాములు గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంలో భాగస్వామ్యం కావాలి

- డిప్యూటీ సిఎం రాజన్నదొర
- 8న తోటపల్లి నీరు విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్నకు చెబుదాంలో అందరూ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. జిల్లా ప్రగతిపై స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో మొబైల్ టవర్లు త్వరగా ఏర్పాటు చేసి మారుమూల గ్రామాల్లో సిగ్నల్స్ అందించాలన్నారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ల మ్యాపింగ్ ను గిరిజనులు, ఆ ప్రాంత ప్రజలు కోరుకున్న చోట్ల చేయాలని ఆయన ఆదేశించారు. సాలూరు ఏరియా ఆసుపత్రి పనితీరుపై ఐటిడిఎ పిఒ, డిఎంహెచ్ఒతో విచారణ జరిపించాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని ఆసుపత్రుల్లో మందులు లభ్యంగా ఉండాలన్నారు. రైతులు కోరుకున్న విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. జల జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనులు త్వరగా పూర్తి చేయాలని, వాటి బిల్లులు వెంటనే అప్ లోడ్ చేయాలని అన్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద చెల్లింపులేకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. జిల్లాకు 1364 పనులు రూ.365 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులను ఇంజినీరింగ్ సహాయకులు పర్యవేక్షించాలని పాలకొండ ఎమ్మెల్యే సభ దష్టికి తెచ్చిన అంశంపై స్పందిస్తూ తెలిపారు. పనులను చేపట్టడంలో సమస్యలు ఉంటే సంబంధిత ప్రజా ప్రతినిధుల దష్టిలో పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఫ్యామిలీ డాక్టరు విధానంలో నెల రోజులు ముందుగా గ్రామ సచివాలయం పరిధిలో షెడ్యూల్ పెట్టాలని ఆయన అన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఆరు అంచెల విచారణపై ప్రతి ఒక్కరికీ స్పష్టత ఉండాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎంపిడిఒలను భాగస్వామ్యం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరితో అర్జీ పెట్టించాలని సూచిం చారు. నాడు నేడు పనుల్లో మూడో విడత కాంపోనెంట్స్ లేవని, వాటిని సమకూర్చేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రైతులకు ధవీకరించిన విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాలు పొందిన రైతులకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపడుతున్న పనుల బిల్లులు అప్ లోడ్ చేసేందుకు 24x7 వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో అటవీ అనుమతులు అవసరమైన రహదారులకు ఐదు రోజుల్లో మంజూరు చేస్తామని చెప్పారు. ఫ్యామిలీ డాక్టరు విధానం అమలు చేయడం ద్వారా ఓపి 26 వేలకు పెరిగిందన్నారు. సీతంపేట ప్రాంతంలో 51 గూడెలను రెవెన్యూ గ్రామాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరుగుతున్న మ్యాపింగ్ వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, దీన్ని పరిశీలించాలని అన్నారు. పాలకొండ లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు భవనాన్ని గుర్తించామని చెప్పారు. ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ సీతంపేట ప్రాంతంలో ఆర్‌డబ్ల్యుఎస్ పనుల పరిశీలనకు ఇంజినీర్ల కొరత ఉందన్నారు. సీతంపేటలో ఇంగ్లీష్ మీడియం జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ మునిసిపల్ డంపింగ్ యార్డును మార్చుటకు భూమిని అప్పగించాలని అన్నారు.

8న తోటపల్లి నీరు విడుదల

జూన్ 8న తోటపల్లి నీరు విడుదల చేసేందుకు ప్రాథమికంగా సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వర రావు, ఎమ్మెల్సీ ఐ.రఘురాజు, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు సి.విష్ణుచరణ్,కల్పనా కుమారి, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, డిఎఫ్ఒ జిపిపి ప్రసూన, అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

ఉమ్మడి జిల్లా నేతలకు చంద్రబాబు పిలుపు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని టిడిపి నాయకులకు ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. శృంగవరపుకోట పట్టణంలోని శిరికి గ్రీన్ సిటీలో శుక్రవారం చంద్రబాబు ఉత్తరాంధ్ర మూడుజిల్లాల నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నిరంతరం శ్రమించాలన్నారు. టిడిపి అధికారంలోకి రావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి చేసిన ఘనత టిడిపి కే దక్కుతుందన్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి సైకోపాలనతో ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని గాలికి వదిలేశారని అన్నారు. విద్యుత్తు ఛార్జీలు, ఇంటి పన్ను, చెత్త పన్ను వేసి సామాన్య ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారన్నారు. వైసిపి గత నాలుగేళ్లగా పేదలను అనేక రకాలుగా మోసం చేస్తూ ఇసుక, మైనింగ్, లిక్కర్ లలో అరాచకాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిందని అన్నారు. సమావేశంలో కిమిడి కళా వెంకటరావు, గంటా శ్రీనివాస రావు, కిమిడి నాగార్జున, కోళ్ల లలిత కుమారి, పల్లా శ్రీనివాస రావు, భరత్, కోండ్రు మురళి, కొండపల్లి అప్పల నాయుడు, గుమ్మడి సంధ్యారాణి, బొబ్బిలి చిరంజీవులు, కోరాడ రాజబాబు, గిడ్డి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

4,742 మంది వాలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో 4742 మంది వాలంటీర్లు సేవా పురస్కారాలు అందుకున్నారు. వాలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, విశ్వసరాయి కళావతి పురస్కారాలను ప్రదానం చేశారు. జిల్లాలో 4633 మందికి సేవా మిత్ర, 90 మందికి సేవా రత్న, 19 మందికి సేవా వజ్ర వెరసి 4,742 మందికి పురస్కారాలు లభించాయి. జిల్లాలో 312 గ్రామ, 38 వార్డు సచివాలయాలు వెరసి 350 ఉండగా 4947 మంది వాలంటీర్లు గ్రామ స్థాయిలో, 676 మంది పట్టణ స్థాయిలో వెరసి 5623 పోస్టులు ఉండగా 4851 మంది వాలంటీర్లు గ్రామ స్థాయిలో, 643 మంది పట్టణ స్థాయిలో వెరసి 5494 మంది పనిచేస్తున్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న 4030 మందికి సేవా మిత్ర, 75 మందికి సేవా రత్న, 17 మందికి సేవా వజ్ర పురస్కారాలు లభించాయి. పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న 603 మందికి సేవా మిత్ర, 15 మందికి సేవా రత్న, ఇద్దరికి సేవా వజ్ర పురస్కారాలు లభించాయి.



వాలంటీర్లక చెక్కునుడిప్యూటీ సిఎం రాజన్నదొర, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే జోగారావు

అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించేందుకు వాలంటీరు వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అవినీతి లేని, పారదర్శకంగా పథకాలు చేర్చుతున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ సేవ చేయడం వల్ల సమాజంలో గౌరవం లభిస్తుందని అన్నారు. మరిన్ని సేవలు అందించాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వాలంటీర్లు నాణ్యమైన సేవలు అందిస్తున్నారని, ప్రభుత్వ కార్యక్రమాలు క్షణాల్లో చేరుటకు, సమాచారం చేరవేయడానికి వ్యవస్థ చక్కగా పనిచేస్తుందన్నారు. వాలంటీర్లు సేవా పురస్కారాలకు రూ.5 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ బి. గౌరీశ్వరి, సచివాలయాల నోడల్ అధికారి కె.రామచంద్ర రావు, మునిసిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, పార్వతీపురం ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ రేవతమ్మ, బలిజిపేట, సీతానగరం మండలాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఢిల్లీలో గత 20 రోజులుగా మహిళా మల్లయోధులు (రెజ్లర్లు) చేపడుతున్న పోరాటానికి మద్దతుగా ప్రజా సంఘాల జాతీయ కమిటీల పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు, ఐద్వా, రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి వి.రామలక్ష్మి మాట్లాడుతూ క్రీడాకారుల పట్ల బిజెపి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తుందని, క్రీడాకారులు దేశానికి పతకాలు తీసుకొస్తుంటే, బిజెపి ఎంపీలు, మంత్రులు మాత్రం వారిపట్ల నీచంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రెజ్లర్లను వేధించిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్, హర్యానా మంత్రి సందీప్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేసి, క్రీడాకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, సిఐటియు నాయకులు గవర వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, ఆర్.రమణమూర్తి, పారమ్మ, అప్పయమ్మ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

రెజ్లర్లకు మద్దతుగా నిరసన



గుమ్మలక్ష్మీపురంలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు

గుమ్మలక్ష్మీపురం : మహిళ రెజ్లర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ డిమాండ్ చేశారు. రెజ్లర్లకు మద్దతుగా గుమ్మలక్ష్మీపురం-ఎల్విన్ పేట ప్రధాన రహదారిపై శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 39 కేసుల్లో నిందితుడుగా ఉన్న బిజెపి ఎంపి బ్రిజ్జిభూషణ్ సింగ్‌ను తక్షణం అధికార రాజకీయ పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రెజ్లర్లకు మద్దతుగా ప్రజా సంఘాలు పెద్దఎత్తున ఉద్యమించుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.గౌరీశ్వరరావు, బిడ్డిక శంకర్రావు, బిడ్డిక ఆడిత్తు, భీమారావు, పువ్వల తిరుపతిరావు, మండంగి సన్యాసిరావు తదితరులు ఉన్నారు.



చెరువు గట్టుపై నిర్మించిన రోడ్డు

చెరువు గట్టుపై రోడ్డు

రెవెన్యూ అండతో ఆక్రమణ • చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని పెదబోరబంద పంచాయతీ పరిధిలో గల దేవుబుచ్చింపేట సమీపంలో ఓ భూస్వామి దర్జాగా చెరువును కబ్జా చేసి తన పొలానికి రహదారి నిర్మించుకున్నాడు. సర్వే నెంబర్ 197-1లో ఉన్న కొటియాడ బంద గట్టును, అదే చెరువులోని మట్టితో వెడల్పు చేసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. రెవెన్యూ అధికారుల అండదండలతోనే సంబంధిత భూస్వామి ప్రభుత్వ చెరువును ఆక్రమించి తన ఇష్టానుసారం రోడ్డు నిర్మించారు. సాలూరు నుంచి మక్కువ వెళ్లే రోడ్డును ఆనుకుని ఉన్న కొటియాడ బంద కింద సుమారు వంద ఎకరాల ఆయకట్టు భూమి వుంది. కొటియాడ బంద గట్టు ఆక్రమణ కాకముందు సన్నగా వుండేది. ద్విచక్ర వాహనాల రాకపోకలు సాగించేందుకు అనువుగా వుండేది. తన భూమిలోకి ట్రాక్టర్లు, లారీలు వెళ్లాలంటే చెరువు గట్టు మీద వీలు కాదని, చుట్టూ తిరిగి పొలానికి వెళ్లాల్సి వస్తోందని భూస్వామి భావించారు. దీంతో ఆయన తన ఇష్టారాజ్యంగా చెరువు గట్టును వెడల్పు చేసి ట్రాక్టర్లు, లారీలు వెళ్లడానికి వీలుగా రోడ్డు నిర్మాణం చేశారు. ఒక వైపు మండలంలోని దత్తివలస రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ చెరువులు కబ్జాకు గురైన విషయంపై పార్వతీపురం ఆర్‌డిఒ హేమలత విచారణకు ఆదేశించారు. ఈలోగా బోరబంద పంచాయతీ పరిధిలో ఉన్న కొటియాడ బంద ఆక్రమణకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై విఆర్‌ఒ గంగరాజును వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆయన సరైన సమాధానం చెప్పలేదు. తహశీల్దార్ రామస్వామిను వివరణ అడగ్గా కొటియాడ బంద ఆక్రమణపై విచారణ చేయిస్తానని చెప్పారు. గ్రామ సర్వేయర్‌తో చెరువు కబ్జాకు గురైనదా లేదా నిర్ధారణ చేసి నివేదిక ఇవ్వాలని మండల సర్వేయర్ రాజేశ్వరరావును ఆదేశించినట్లు తహశీల్దార్ తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

సీతంపేట : మండలంలో పలు కేంద్రాల్లో అంగన్వాడి హెల్పర్ల పోస్టులకు శుక్రవారం ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఎంపికైన జాబితాను విడుదల చేసినట్లు సిడిపిఒ పి. రంగలక్ష్మి తెలిపారు. మండలంలో ఆడలీ అంగన్వాడీ వర్కర్‌గా నేరడి జయంతి, మొగధార అంగన్వాడి వర్కర్‌గా పాలక సునీత, ఓండ్రు జోల హెల్పర్‌గా సవర సునేమి, మండ హెల్పర్‌గా సవర సుజాత, అడ్డాకుల గూడ హెల్పర్‌గా నిమ్మక దివ్య, ఈతమాను గూడకు సవర సలోమి ఎంపికైనట్లు తెలిపారు.

ఈదురు గాలులకు కూలిన చెట్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ ఈదురు గాలులు వీచాయి. దీంతో పలు ప్రాంతాల్లో చెట్లు నేల కులాయి. గుమ్మలక్ష్మీపురం హౌసింగ్ కార్యాలయం ఆవరణంలో పార్కు చేసి ఉన్న ఎఇ రెడ్డి శ్రీనివాసరావు బైకుపై భారీ వృక్షం కూలింది. ఆ సమయంలో బైక్ పక్కన ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అలాగే మండలంలో పలుచోట్ల ఏళ్ల తరబడి ఉన్న ఎండిన చెట్లు నేలకులుతున్నాయి. ఏ క్షణాన ఏ చెట్టు ఎవరిపై పడుతుందో తెలియని పరిస్థితి. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ప్రధాన రహదారిపై ఈదురుగాలులకు చెట్లు కొమ్మలు తెగిపడుతూ ఉన్నాయి. మరోవైపు ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కూడా కురిసింది. ఈ వర్షాలు పోడు వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, పి.ఆమిటి, లక్కగూడ, జెకెపాడు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

వీరఘట్టం: మండలంలో శుక్రవారం సాయంత్రం బీభత్సమైన గాలులు వీశాయి. గత నాలుగు రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. పెనుగాలుల వల్ల మామిడి, అరటి పంటలకు నష్టం వాటిల్ల ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుమ్మలక్ష్మీపురంలో బైక్‌పై కూలిన వృక్షం

బైక్ పై పడిన చెట్టు • తప్పిన పెను ప్రమాదం



మృతి చెందిన తాతబాబు

పిడుగు పాటుకు వ్యక్తి మృతి

పార్వతీపురం రూరల్ : మండలంలోని పెద్ద బొండపల్లి గ్రామ శివారులో శుక్రవారం పిడుగుపాటుకు గ్రామానికి చెందిన వంగపండు తాతబాబు(46) మృతి చెందాడు. తన పొలంలో పశువులను మేపుతున్న సందర్భంగా ఒక్కసారి ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో రక్షణ కోసం పొలంలో ఉన్న బావి దగ్గరికి వెళ్ళాడు. అక్కడ ఒక్కసారిగా పిడుగు పడటంతో పక్కనే ఉన్న నూతిలోనే పడిపోయాడు. అతన్ని నూతిలో నుంచి బయటకు తీయగా అప్పటికే చనిపోయాడు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిఐలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాకు విశేషస్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పిఒ కల్పనాకుమారి మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను వినియోగించుకోవాలని కుటుంబ ఆర్థిక అభివృద్ధిలో దృష్టిలో పెట్టుకొని ఎంపికైన కంపెనీలో అంకితభావంతో పని చేయాలన్నారు. జాబ్ చేసే ప్రాంతాలకు అలవాటు పడాలని కోరారు. అంకితభావంతో పనిచేస్తే మంచి జీవితం, జీతం పొందేలా పనిచేయాలన్నారు. ఐటిఐ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఐటిఐలో విద్యార్థులు చేసిన స్క్రాప్‌తో డ్రెస్ మేకింగ్ ట్రేడ్ నందు తయరుచేసిన అల్లికలు గార్మెంట్స్ చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మెగా జాబ్ మేళాలో 14 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్‌మేళాకు 549 మంది విద్యార్థులు హాజరుకాగా 223 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, డిఎస్‌డిఒ సాయికుమార్, ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి తదితరులు పాల్గొన్నారు.



మేళాలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

నర్సరీని పరిశీలించిన పిఒ

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పరిధిలో గల నర్సరీని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. నర్సరీ అభివృద్ధికి పూర్తి ప్రణాళిక తయారు చేసి ఇవ్వాలని హార్టికల్చర్ సిబ్బందికి సూచించారు. మొక్కలను అంటు కట్టే పద్ధతులను పరిశీ లించారు. కార్యక్రమంలో సబ్బెంట్ కాంతారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నుంచి రెడ్యూస్ రీసైకిల్ రీ యూజ్

పాలకొండ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయితీలో రెడ్యూస్ - రీసైకిల్ రీ యూజ్ నినాదంతో ఈనెల 20 నుంచి 30వరకు రీసైక్లింగ్ ప్రక్రియకు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, బూట్లు తదితర వస్తువులను పెద్ద ఎత్తున సేకరణ నిమిత్తం స్థానిక మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నెం 6లో శనివారం స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. ఈ షాపు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్, చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, గౌరవ కోప్షన్ మెంబర్లు, కౌన్సిలర్ ప్రతినిధులు పాల్గొనున్నారని తెలిపారు.

గిరిజనులకు అవగాహన

ప్రార్వతీపురం రూరల్ : గిరిజనులకు జీవనాధాంమైన అడవులను సంరక్షించుకొంటూ పర్యావరణాన్ని కాపాడుకోవడం పట్ల అవగాహన పెంచుకోవాలని మక్కువ మండల అటవీఅధికారి కె.నారాయణరావు అన్నారు. లైఫ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్వతీపురం మండలం డోకిశీల పంచాయితీ పరిధిలోని పలు గిరిజన గ్రామాలను సందర్శించి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన ఇంధన వనరులు, నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఒకసారి వాడిపారవేసే ప్లాస్టిక్ వ్యర్థాలను ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించాలని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ రోజు వారి జీవన విధానంలో మార్పులు చేసుకోవాలని సూచించి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీట్ అధికారులు బివి రమణ, సతీష్, గణపతి సహాయబీట్ అధికారులు సూర్యనారాయణ,మురళి పాల్గొన్నారు.



హోటల్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పారిశుధ్య పనుల పరిశీలన

పాలకొండ: నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు పట్టణంలోని మెయిన్ రోడ్డుతో, పలు వీధుల్లో జరుగుతున్న శానిటేషన్ పనులను శుక్రవారం పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. చెత్తలు పేరుకుపోయిన ప్రదేశాలను గుర్తించి క్లియర్ చేయాలన్నారు. వీధుల్లో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్త చెదారాలను క్లియర్ చేయాలని, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా శానిటేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ చేపడుతున్న సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న హోటల్స్, చికెన్ షాపులు, కిరాణా షాపులు మొదలగు షాపులను హెల్త్ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సిబ్బందితో తనిఖీ చేసి అపరాధరుసుం విధించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ జోగులు

పాలకొండ రూరల్: మండు టెండల్లో వివిధ పనులపై తిరుగుతున్న ప్రజల దాహార్తి తీర్చడానికి స్థానికంగా జైలు సిబ్బంది ముందుకొచ్చారు. ఈ మేరకు స్థానిక జైలు సూపరింటెండెంట్ బి. జోగులు అనుమతితో జైలు బైట చలివేంద్రం ఏర్పాటు చేశారు. జైలు ముందు నుంచి ప్రతి రోజూ పదుల సంఖ్యలో విద్యార్థులు, వార్డర్ అలాగే కోర్టు, పోలీసు స్టేషన్ పనుల కోసం వచ్చీ పోయే వారికి ఈ చలివేంద్రం ద్వారా దాహార్తిని తీర్చేందుకు ముందుకొచ్చిన జైలు సిబ్బందిని ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో హెడ్ వార్డెన్ పి.చంద్రరావు, పి.మధు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు అభినందనలు

సీతానగరం: మండలంలోని పెదంకలాం సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లు వంగపండు వేణు, అనసూయకు సేవా పురస్కార అవార్డు అందుకోవడం పట్ల సర్పంచ్ వి.శ్రీనివాసరావు, ఎంపిపి బి.రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి గౌరీశ్వరి అభినందించారు. భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు.

పాలకొండ రూరల్: సేవామిత్ర అవార్డు గ్రహీత మిడతన గణేష్ పాలకొండ పట్టణం-1 సచివాలయంలో నాలుగేళ్లుగా వాలంటీరుగా సేవలందిస్తున్నారు. తనకు కేటాయించిన 50 కుటుంబాలకు ఉత్తమ సేవలందించినందుకుగాను తన సేవలను గుర్తించి సేవామిత్ర అవార్డు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని, అవార్డుతో పాటు రూ.30 వేలు నగదు బహుమతి అందించారని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తానన్నారు. తన సేవలను గుర్తించిన ప్రభుత్వానికి, అధికారులకు,ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి వస్తేనే మంచి రోజులు

సీతానగరం: మనకు మంచి రోజులు రావాలంటే మన సాదక బాధలు తెలుసుకొని ఖచ్చితమైన చిరునామా నారా చంద్రబాబునాయుడు అని టిడిపి సీనియర్ నాయకులు గర్భాపు ఉదయభాను అన్నారు. మండలంలోని పదమయవలస, మిర్తివలస గ్రామాల్లో ఉపాధి హామీ వేతనదారులను కలుసుకొని వారి సమస్యలు తెలుసుకొని మళ్లీ మంచి రోజులు రావాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ విలువలు కలిగిన నేత, ప్రజా వ్యతిరేక విధానాలతో కొనసాగుతున్న వైఎస్సార్ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం దగ్గర పడుతుందన్నారు. కార్యక్రమంలో మిర్తివలస మాజీ సర్పంచ్ దూడి భాస్కరరావు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కూరాకుల వీధిలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం: మండల కేంద్రంలోని కూరాకుల వీధిలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ చంటి పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, జ్వర పీడితులు, రక్తపోటు మధుమేహ తదితర వ్యాధులు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జనార్దనరావు, సూపర్వైజర్ ఒ.శారద కుమారి, ఎఎన్ఎంలు జానకి, రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి కావ్య, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 పైలెట్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం: పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్: మండలంలో కొండాపురంలో జరుగుతున్నఉపాధి పనులను ఎంపీడీవో డొంక త్రినాధులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన దారులు సమయపాలన పాటించి పనులు చేపట్టాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు కూలి పొందాలన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న తన దష్టికి తీసుకురావాలని అన్నారు.

సీతానగరం మండలంలోని లక్ష్మీపురం, వెంకటాపురం, గుచ్చిమి, సోరంపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ ఎంఎస్ ఎన్ఎల్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ కొలతల ప్రకారం పని చేయాలని, పనిచేస్తే ప్రభుత్వం నిర్ణయించిన వేతనం గిట్టుబాటు అవుతుందని అన్నారు. వడదెబ్బకు గురికాకుండా మంచినీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పిఆర్ జెఇ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

పనులను అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి– కురుపాం

ఐటిడిఎ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపాన ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంకు పనులను అడ్డుకోవడం సరికాదని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ అన్నారు. ఇప్పటికే రెవెన్యూ, సర్వే అధికారులు గుర్తించిన ప్రభుత్వ స్థలం పెట్రోల్ బంకు నిర్మాణానికి అనుకూలమని నిర్ణయించారన్నారు. అయితే ఇదే భూమి సమీపంలో మంతినివలస గిరిజనుల శ్మశాన వాటికగా ఉండడంతో పనులు జరగకుండా గిరిజనులు అడ్డుకోవడంతో శుక్రవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు వారితో మాట్లాడి స్థల పరిశీలన చేసి శ్మశాన వాటిక హద్దులను వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఎస్సై షణ్ముఖరావు, అర్ ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి సుందరయ్య

ప్రజాశక్తి - కలెక్టరేట్

పేదల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం నాయకులు జి.వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి అన్నారు. సుందరయ్య 38వ వర్ధంతి శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగింది. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు గాంధీగా పిలవబడే పుచ్చలపల్లి సుందరయ్య అణగారిన పేదల బతుకుల మార్పునకు నిరంతరం తపించారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా పేరొందిన సుందరయ్య ఆశయాలను కొనసాగించడం ఆయనకు ఘనమైన నివాళి అవుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కద్రక రామస్వామి, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, ప్రజా సంఘాల నాయకులు గెద్ద తులసి, గుడుపూరు కృష్ణ, చీపురుపల్లి సింహాచలం, నాగవంశం నిర్మల, జగ్గరాజు, లక్ష్మీపతిరాజు, కొండగొర్రి రాజు, బౌరోతు గౌరి, రెడ్డి వెంకటరత్నం పాల్గొన్నారు.

పాచిపెంట: మండల కేంద్రమైన పాచిపెంట పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ సిపిఎం మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు అధ్యక్షతన కమ్యూనిటీ భవనం వద్ద జరిగింది. తొలుత సుందరయ్య చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకులంతా పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సుందరయ్య కూలి కోసం, భూమి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని త్యాగం చేసినటువంటి ధన్యజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.రామారావు, రైతు సంఘం నాయకులు ముళ్ళు



పార్వతీపురం: చిత్రపటానికి మాలవేస్తున్న నాయకులు



బలిజిపేట: నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

తాతబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే కర్రివలస పంచాయతీ మూలవలస గ్రామంలో సుందరయ్య వర్ధంతి సభ జరిగింది.

సాలూరు రూరల్ : సుందరయ్య 38వ వర్ధంతి సభ నెలిపర్తి పంచాయతీ బట్టి వలసలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్ట జీవులు ఆశా జ్యోతి సుందరయ్య, ఆయన జీవితం పేదల కోసం అంకితం చేసి నికరంగా ప్రజాసమస్యలు పై రాజీలేని పోరాటం చేసారని తెలిపారు సుందరయ్య చూపిన బాటలో నడవా లని కోరారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు మర్రి మసి, వంతల చిన్న ,తులసి, మర్రి రాజు తదితరులు పాల్గొన్నారు



పాలకొండ: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సీతానగరం : మండల కేంద్రంలో సుందరయ్య వర్ధంతి సభ సిపిఎం మండల కమిటీ సభ్యులు గవరవెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ సుందరయ్య తన జీవితాంతం దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారని, పీడిత ప్రజానీకం తరఫున నికరంగా నిలబడ్డారని అన్నారు. సుందరయ్య స్ఫూర్తితో పెద్ద ఎత్తున ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు, వెన్నెల రామలక్ష్మి, సిహెచ్.కష్ణ, ఆర్.రమణ మూర్తి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం :పీడిత ప్రజల ప్రియతమ నేత, భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతకామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్క కార్యకర్త కషి చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు కె.గౌరీశ్వరరావు పిలుపునిచ్చారు. సుందరయ్య 38వ వర్ధంతి సభను గుమ్మలక్ష్మీపురంలోని ఎపి గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించారు. తొలుత సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పువ్వల తిరుపతిరావు , బిడ్డిక శంకర్రావు, బిడ్డిక ఆడిత్తు, భీమారావు, నూకయ్య మండంగి సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

బలిజిపేట : స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సభ సిపిఎం మండల కమిటీ సభ్యులు గంట్యాడ బల రామునాయుడు అధ్యక్షతన జరిగింది. న సభలో పార్టీ సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ మాట్లా డుతూ సుందరయ్య తన జీవితాంతం దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారని, పీడిత ప్రజానీకం తరపున నికరంగా నిలబడ్డారని అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.మన్మధరావు, ఆవు సాంబమూర్తి, పారినాయుడు, బాలరాజు, లక్ష్మి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయంలో జరిగిన సుందరయ్య వర్ధంతి వేడుకల్లో భాగంగా సంజీవ నాయుడు మాట్లాడుతూ పుచ్చలపల్లి మరో గాంధీ అని కొనియాడారు.

పాలకొండ రూరల్: మండల కేంద్రమైన పాలకొండలో సుందరయ్య వర్ధంతి సభ సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ కష్టజీవుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సుందరయ్య స్ఫూర్తితో నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి. జెస్సి బాయ్, కాద రాము, దూసి దుర్గారావు, చింతల సంజీవి, పడాల వేణు, వై. శ్రీనివాసరావు, వై. సింహాలు తదితరులు పాల్గొన్నారు.



సాలూరు : మాట్లాడుతున్న ఎన్వై నాయుడు

సాలూరు: దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పాత్ర మరువలేనిదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా పట్టణ నాయకులు టి.వెంకటరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సుందరయ్య ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆయన వారసత్వానికి కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు స్వప్న, రవి పాల్గొన్నారు.




సీతానగరం : నివాళులర్పిస్తున్న నాయకులు

చంద్రబాబు నీచ రాజకీయాలు మానుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాజధాని అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే నీచ రాజకీయాలకు మారుపేరైన చంద్రబాబు చూసి ఓర్వలేక పోతున్నారని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. శుక్రవారం పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిషత్ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షుద్ర రాజకీయాలకు మారుపేరుగా నిలిచింది ఆనాటి చంద్రబాబు నాయుడు పాలన అయితే, మానవత్వానికి మరో రూపంగా నిలుస్తుంది మన సిఎం జగన్ అనే విషయం అందరికీ తెలుసని అన్నారు. చంద్రబాబు నాయుడు అమరావతి ఇల్ల స్థలాలు పంపిణీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో పాలకొండ ఎమ్మెల్యే వి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: జగన్మోహన్‌రావును సత్కరిస్తున్న నాయకులు

అమరావతి కుంభకోణాల పుట్ట

సాలూరు: టిడిపి ప్రభుత్వం హయాంలో చేపట్టిన అమరావతి భూసేకరణ కుంభకోణాల పుట్ట లాంటిదని పట్టణ వైసిపి అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు అన్నారు. ఇటీవల వైసిపి జిల్లా ప్రచార కన్వీనర్‌గా నియామకమైన గొర్లి జగన్మోహన్‌రావును శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అప్పలనాయుడుతో సహా కౌన్సిలర్లు, నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాజధాని భూసేకరణలో అనేక అక్రమాలు జరిగాయని, ఆధారాలు లభించడంతోనే సుప్రీంకోర్టు సిట్ విచారణ కు అనుమతి ఇచ్చిందని తెలిపారు. టిడిపి యువనేత లోకేష్ బాబు యువగళం పాదయాత్ర జనాదరణ లేదన్నారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర నియోజకవర్గం లో వందల కోట్ల అభివృద్ధి పనులు చేశారని చెప్పారు. గతంలో ఏ ఎమ్మెల్యే హయాంలోనూ జరగని అభివృద్ధి జరిగిందని చెప్పారు. ప్రచారకమిటీ జిల్లా కన్వీనర్ గొర్లి జగన్మోహన్ రావు మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయని చెప్పారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా రాజన్నదొర గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గొల్లపల్లి వరప్రసాద్, సింగారపు ఈశ్వరరావు, పి.మధుసూధనరావు, మాజీ కౌన్సిలర్లు తాడి శంకరరావు, కొల్లి వెంకటరమణ, యర్రా దాలినాయుడు, వైసిపి నాయకులు పి.అప్పలస్వామి, బి.బాలకృష్ణ, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

ఏనుగుల తరలింపులో ప్రభుత్వ వైఫల్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో 17 ఏళ్ల నుంచి అడవి ఏనుగుల గుంపు సంచారంతో ఎంతోమంది మృతి చెందగా, ఆస్తినష్టం సంభవించినా ఏనుగుల తరలింపులో ప్రభుత్వం వైఫల్యమైందని నియోజకవర్గ టిడిపి నాయకులు నందివాడ కృష్ణబాబు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జిఎంవలస, కొమరాడ, భామిని మండలాల్లో అడవి ఏనుగుల గుంపు సంచారంతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతుందన్నారు. రైతులు పండించిన వేలాది ఎకరాల పంటలను నాశనం చేస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. భామిని మండలంలో నాలుగు ఏనుగులు విద్యుత్ షాక్‌తో చనిపోయాయని, వీటికి కారణం అధికారుల నిర్లక్ష్యమా, ప్రభుత్వం చేతకానితనమా అని ప్రశ్నించారు. డిప్యూటీ మాజీ సిఎం, స్థానిక ఎమ్మెల్యే ఏనుగుల సమస్య పరిష్కారానికి కనీసం చొరవ చూపడం లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కూడా ఏనుగుల సమస్యపై కనీసం ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. ఏనుగుల సమస్యను పరిష్కరించి బాధితులకు నష్టపరహారం అందించాలని డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు కనీస సౌకర్యాలు లేవని, వైద్యుల కొరత ఉందని అన్నారు. గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని, మాతా శిశు మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి మండల నాయకులు మండంగి భూషణ, ఎన్‌వికెడి ప్రసాదరావు ఉన్నారు.

చంద్రబాబును కలిసిన చిరంజీవులు

పార్వతీపురం రూరల్ : ఎస్.కోట నియోజకవర్గంలో పర్యటిస్తున్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు శుక్రవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నియోజకవర్గ పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం విస్తృతంగా నిర్వహించి ప్రజల్లోకి వెళ్లాలని, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామస్థాయిలో కార్యకర్తలను, నాయకులను కలుపుకొని పార్టీని పటిష్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్చార్జి గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో చప్పబుచ్చంపేట రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నవధాన్య విత్తనాలు కిట్లు పంపిణీ చేశారు. 'నవధాన్యాలు సాగు నేలతల్లికి బాగు' అనే కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ మక్కువ యూనిట్ ఇంచార్జిలు నలితం గంగరాజు, ఉర్లక నాగార్జున రైతులకు నవధాన్య విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఈ నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమిలో జీవవైవిధ్యం పెరిగుతుందని, కార్బన శాతం పెరిగి భూసారం పెరుగుతుందని, వానపాములు వృద్ధి చెందుతాయని తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. ఈ నవధాన్య విత్తనాలు కిట్లు ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులందరు ఈ నవధాన్య విత్తనాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిఎ వెన్నెల, వైస్ ఎంపిపి చప్ప రామలక్ష్మి, వైసిపి నాయకులు చప్ప సూర్యనారాయణ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బలిజిపేట: పచ్చి రొట్ట విత్తనాలు - ప్రయోజనాలపై వంతరాంలో రైతులకు శుక్రవారం మండల వ్యవసాయాధికారి శ్రవణ్ కుమార్ అవగాహన కల్పించారు.



మక్కువ: నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఈ సంధ్బంగా ఆయన రైతులు పచ్చిరొట్ట విత్తనాలు వేసుకొని 30-45 రోజుల్లో లేదా పూత దశ లో భూమిలో కలియ దున్నాలని, ఇలా చేయడం వల్ల 9-10 టన్నుల పచ్చిరొట్ట మన నేలకు అందడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. నేల ఉత్పాదకత పెరుగుతుందని, నేల గుల్ల బారి చౌడు విరిగిపోతుందని కలుపును అదుపులో ఉంచుతుందన్నారు. నేలలో నీళ్ల ఇంకే గుణం పెరుగు తుందని, గాలిలో ఉండే నత్రజనినీ స్థిరీకరిస్తా యన్నారు. సూక్ష్మజీవుల అభివృద్ధి పెరుగుతుందన్నారు. వీటిని భూమిలో కలియదున్నడం వల్ల వచ్చే భూసారం వల్ల 5-10శాతం రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో ఆవశ్యకమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని చినగుడబ, పెదగుడబ, ఎస్ఆర్ పేట గ్రామాలను శుక్రవారం సందర్శించి డ్రైడే కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాలువల్లో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలని, లేకపోతే అవి దోమల వ్యాప్తికి అనుకూలిస్తాయని తద్వారా మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలకు మొదలగు సీజనల్ వ్యాధులకు గురవుతామని అన్నారు.



కాలువల్లో కొడుతున్న స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న డిఐఒ

ఇటువంటి హై రిస్క్ ప్రదేశాలను గుర్తించి తగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆయన పర్యవేక్షణలో సిబ్బంది కాలువల్లో దోమల నివారణ మందును పిచికారి చేశారు. గ్రామాల్లో జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిఐఒ జగన్మోహనరావు ప్రజలకు పై అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.దుర్గాప్రసాద్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, సూపర్‌వైజర్లు, విజయకుమారి, శర్మ, జయగౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం శ్రీమంతుడు మృత్యుంజయరావు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పుట్టిన గ్రామానికి ఏదో చేయాలనే తపనతో స్థానిక జూనియర్ కళాశాల, ముఖ్యంగా మున్సిపల్ ఉన్నత పాఠశాలలను సొంత ఖర్చులతో అభివృద్ధిపర్చి పార్వతీపురం శ్రీమంతుడుగా పేరు తెచ్చుకున్న సారిపల్లి మృత్యుంజయరావు శుక్రవారం హైదరాబాదులో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పట్టణ ప్రజలు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, కేపీఎం స్కూలు, డివిఎంఎం స్కూలు, గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల పార్వతీపురం క్రీడా మైదానాలు తన సొంత నిధులతో లక్షలాది రూపాయలు వెచ్చించి అభివద్ధి చేశారు. వీటితో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను జిల్లా వృతివిద్యాశాఖ అధికారి మంజులవీణ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి జరుగుతున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ శిక్షణా తరగతులు బాగా సద్వినియోగం చేసుకుని సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం పలు ప్రైవేటు కళాశాలలను సందర్శంచారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతిపై అత్యాచారం

పాలకొండ: పట్టణంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో యువతిపై అత్యాచారం జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న గణేష్‌ను తన చెల్లి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చింది. అదే వార్డులో మరో రోగికి సహాయకుడుగా ఉన్న పాలకొండ పట్టణానికి చెందిన వినోద్ మాయమాటలు చెప్పి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నదిలో పడి గిరిజనుడు మృతి

సాలూరు: మండలంలోని సారికపంచాయతీ దండిగాం సమీపాన సువర్ణముఖి నదిలో పడి గిరిజనులు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. దండిగాంకు చెందిన కశింకోట అచ్యుతరావు (30) ఈనెల 17న సారిక వెళ్లి వస్తాయనని ఇంటి వద్ద చెప్పి బయటకు వెళ్లాడు. గురువారం వరకు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన భార్య రంజిని బంధువుల ఇళ్లకు వెళ్లి ఆరా తీసింది, ఆచూకీ లభించకపోవడంతో ఆమె ఆందోళనకు గురైంది. శుక్రవారం సమీపాన గ్రామానికి చెందిన గిరిజనుడు అచ్యుతరావు మృత దేహం గెడ్డలో ఉందని చెప్పడంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. తన భర్త అచ్యుతరావు మద్యానికి బానిసై నదిలో కొట్టుకుపోయి ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 12వ రోజు తంపటాపల్లి డ్రాయింగ్ మాష్టర్ గొర్లె మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నీటి పొదుపు, పర్యావరణం, పండ్లు బొమ్మలు వేశారు. సుమారు 25 మంది పిల్లలు పాల్గొన్నారు. అనంతరం యోగా గురువు కె.జనార్ధనరావు పిల్లలకు యోగా నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాఅధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భామిని : స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపులో అడ్మిషన్ కోసం పదో తరగతి పాసైన అభ్యర్థుల నుంచి ఈనెల 22 నుంచి జూన్ 7వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టి విద్యార్థులు రూ.150, బిసి, ఒసి విద్యార్థులు రూ.200 పరీక్ష రుసుంను ఇంటర్నెట్/ మీ సేవా కేంద్రాల్లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.వివరాలకు 9542078996, 9502579287, 9440322964 సంప్రదించాలని తెలిపారు.

కురుపాం : మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి, బైపిసి, సిఇఇ, ఎంఇసి గ్రూపుల్లో చేరడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎ.సుందర్రావు ఒక ప్రకటనలో తెలిపారు.